నమస్తే తెలంగాణ
వికారాబాద్
I | హైదరాబాద్, శనివారం 29 జూన్ 2024 | VIKARABAD



పూడూరు మండలంలోని మీర్జాపూర్ గ్రామ నర్సరీ

# నాటి హారం నేడు భారం

## నర్సరీల్లోనే మొక్కలు..!

- గతనెల చివరికే నాటేందుకు సిద్ధం
- మొక్కలను పెంచేందుకు ఒక్కో నర్సరీకి రూ.1.20 లక్షలను ఖర్చు చేస్తున్న ప్రభుత్వం
- గతేడాదితో పోలిస్తే 10 లక్షల మేర తగ్గిన హరితహారం టార్గెట్
- ఈ ఏడాది 29.33 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం
- వికారాబాద్ జిల్లావ్యాప్తంగా 580 నర్సరీల్లో మొక్కలు సిద్ధం..
- డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో 566 గ్రామ పంచాయతీల్లోని నర్సరీల్లో,..
- అటవీ శాఖ పరిధిలోని 14 నర్సరీల్లో ఔషధ మొక్కలు సిద్ధం

వికారాబాద్, జూన్ 28 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణకు హరితహారం కింద మొక్కలను నాటే కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యతనిచ్చి పచ్చదనం పెంపొందించేందుకుగాను బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం హరితహారం వంటి కార్యక్రమాలను కూడా నిర్లక్ష్యం చేస్తూ వస్తున్నారు. ఏటా జూన్ మొదటి వారంలోనే హరితహారం కార్యక్రమం ప్రారంభ తేదీలను ఖరారు చేసి జూన్ రెండో వారంలో మొక్కలను నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టేది. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం మొక్కలను నాటే కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేస్తున్నది. తెలంగాణకు హరితహారం కార్యక్రమం పేరును వనమహోత్సవంగా మార్చిన ప్రభుత్వం ఇప్పటివరకు వన మహోత్సవంపై అధికారులకు దిశానిర్దేశం చేయలేదు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో గతనెల చివర్లోనే నాటేందుకు నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉన్నప్పటికీ వనమహోత్సవం కార్యక్రమ నిర్వహణపై స్పష్టత లేకపోవడంతో నర్సరీల్లోనే మొక్కలు వృథాగా పడి ఉన్నాయి. ఆలస్యం చేస్తుండడంతో మెయింటెనెన్స్‌కు కూడా ఖర్చు చేయాల్సి వస్తుందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. నర్సరీల్లో మొక్కలు పెంచేందుకుగాను నిర్ణీత గడువు దాటిన అనంతరం సంబంధిత మొక్కల సంరక్షణను గాలికి వదిలేయడంతో కూడా వృథా అవుతున్నాయి. ఇంకా ఆలస్యమైతే నర్సరీల్లోని చాలా వరకు మొక్కలు వృథా అయ్యే అవకాశాలున్నాయి. మరోవైపు మొక్కలు నాటేందుకు ఈనెల మొదటి వారం నుంచి గుంతలు తీసే ప్రక్రియ ప్రారంభం కాగా, కొన్ని చోట్ల తీసిన గుంతలు మూసుకుపోయే పరిస్థితులున్నాయి. జిల్లావ్యాప్తంగా 580 నర్సరీల్లో మొక్కలను పెంచారు. వీటిలో గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీల్లో 566 నర్సరీల్లో 24 లక్షల మొక్కలు, అటవీ శాఖ ఆధ్వర్యంలోని 14 నర్సరీల్లో 17 లక్షల మొక్కలు వృథాగా ఉన్నాయి.

### ఈ ఏడాది 10 లక్షల మేర తగ్గిన లక్ష్యం..

గత ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ఆనవాళ్లు లేకుండా చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణకు హరితహారం కార్యక్రమానికి పేరు మార్చడంతోపాటు మొక్కలను నాటే కార్యక్రమంపై నిర్లక్ష్యం వహిస్తున్నట్లు తెలుస్తున్నది. ఇందులో భాగంగానే ఈ ఏడాది జిల్లావ్యాప్తంగా నాటాల్సిన మొక్కలకు సంబంధించి లక్ష్యాన్ని భారీగా తగ్గిస్తూ నిర్ణయించడం గమనార్హం. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది సుమారు 10 లక్షల మొక్కల మేర లక్ష్యాన్ని తగ్గిస్తూ నిర్ణయించారు. మొదట ఈ ఏడాది 29.33 లక్షల మొక్కలను నాటాలని జిల్లా అటవీ శాఖ అధికారులు లక్ష్యాన్ని నిర్దేశించినప్పటికీ తదనంతరం ప్రభుత్వ ఆదేశాల మేరకు లక్ష్యాన్ని భారీగా తగ్గించినట్లు తెలిసింది. పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా సదుద్దేశంతో తీసుకొచ్చిన మొక్కలు నాటే కార్యక్రమంపై నిర్లక్ష్యం చూపడంపై జిల్లా అంతటా విమర్శలు వెలువడుతున్నాయి. గత ప్రభుత్వం మొక్కలను నాటడంతోపాటు సంరక్షణ చర్యలు చేపట్టడం, జియో ట్యాగింగ్ ప్రక్రియ చేపట్టగా, ఈ ఏడాది జియో ట్యాగింగ్ ప్రక్రియతోపాటు మొక్కల సంరక్షణకు సంబంధించి ఎలాంటి ప్రస్తావన లేదు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి 29.33 లక్షల మొక్కలను నాటాలని లక్ష్యంగా నిర్ణయించగా, గతేడాది జిల్లావ్యాప్తంగా 40.49 లక్షల మొక్కలను నాటాలని టార్గెట్‌గా నిర్ణయించగా, 39.69 లక్షల మొక్కలను నాటారు. జిల్లాలో తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా 2015-16లో 73.78 లక్షల మొక్కలు, 2016-17 సంవత్సరంలో 1.39 కోట్ల మొక్కలు, 2017-18 సంవత్సరంలో 71.04 లక్షలు, 2018-19 సంవత్సరంలో 86.12 లక్షల మొక్కలు, 2019-20 సంవత్సరంలో 1.02 కోట్ల మొక్కలు, 2021-22 సంవత్సరంలో 74 లక్షలు, 2022-23 ఆర్థిక సంవత్సరంలో 40.25 లక్షల మొక్కలు, 2023-24 ఆర్థిక సంవత్సరంలో 39.60 లక్షల మొక్కలను జిల్లాలో నాటారు.



చేవెళ్ల మండలంలోని గొల్లపల్లి గ్రామ నర్సరీలో..


శంకర్‌పల్లి మండలంలోని కొత్తపల్లి గ్రామ నర్సరీ

## మొక్కలు నాటేదెప్పుడో !

- హరితహారం కార్యక్రమానికి ప్రాధాన్యత కరువు
- నర్సరీల్లో మొక్కలు ఉన్నా.. నాటడంలో నిర్లక్ష్యం
- ఈసారి లక్ష్యం సైతం 82 లక్షల నుంచి 25 లక్షలకు కుదించిన ప్రభుత్వం
- కొన్నిచోట్ల మొక్కలు లేక ఖాళీగా దర్శనమిస్తున్న బ్యాగ్‌లు.. ఇంకొన్ని చోట్ల వాడిపోతున్న మొక్కలు
- గత ప్రభుత్వంలో ఏటా 70-80 లక్షల మొక్కల నాటింపు
- తొమ్మిదేండ్లలో రంగారెడ్డి జిల్లాలో 8.27కోట్ల మొక్కలను నాటిన ప్రభుత్వం





**అడవుల శాతం తగ్గడంతో వానలు దూరమయ్యాయి. చెట్లను నరకడం వల్ల మానవ మనుగడకు ముప్పే. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హరితహారం పేరుతో బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. గడిచిన పదేండ్లలో అన్ని ప్రభుత్వ శాఖలు, ప్రజాప్రతినిధులు, చిన్నా, పెద్దా ఉత్సాహంగా మొక్కలు నాటారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.. హరితహారంపై నిర్లక్ష్యం వహిస్తున్నది. ఏటా జూన్ మొదటి వారంలోనే ప్రారంభం కావాల్సిన హరితహారం కార్యక్రమానికి సంబంధించి ఇప్పటివరకూ నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరం. హరితహారం కార్యక్రమాన్ని వనమహోత్సవంగా పేరు మార్చినా ఇప్పటికీ స్పష్టత లేదు.. కొన్ని చోట్ల తీసిన గుంతలు పూడుకుపోయే పరిస్థితి నెలకొన్నది. కాంగ్రెస్ ప్రభుత్వం వనమహోత్సవ కార్యక్రమాన్ని తొందరగా చేపట్టాలని ఉమ్మడి జిల్లావాసులు కోరుతున్నారు.**

రంగారెడ్డి, జూన్ 28 (నమస్తే తెలంగాణ) : హరితహారం మొక్కలు నాటడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనబడుతున్నది. నర్సరీల్లో మొక్కలు ఉన్నప్పటికీ.. నాటడంలో నెలకొన్న జాప్యం కారణంగా మొక్కలు జీవం కోల్పోయి ఎండుముఖం పడుతున్నాయి. కొన్ని నర్సరీల్లో మొక్కలే చెట్లుగా ఏపుగా పెరిగాయి. కేసీఆర్ ప్రభుత్వం హరితహారం కార్యక్రమానికి ఎంతో ప్రాధాన్యత ఇచ్చి ప్రతి మొక్కనూ బతికించుకునే ప్రయత్నం చేసింది. కానీ ప్రస్తుత ప్రభుత్వం లక్ష్యాన్ని సైతం ఈసారి 25 లక్షలకే కుదించడం, సంరక్షణ మరవడంపై పలు వర్గాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి.

### మొక్కలు నాటడంలో జాప్యం..

గతంలో మే నెలలోనే హరితహారం లక్ష్యాన్ని నిర్దేశించి జూన్, జూలై నెలల్లోనే మొక్కలను నాటేందుకు చర్యలు తీసుకునేవారు. ఈసారి అడపాదడపగా వర్షాలు కురిసినప్పటికీ ప్రభుత్వం హరితహారం కార్యక్రమానికి సంబంధించి ఇప్పటివరకు ప్రణాళికను ప్రకటించలేదు. నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉన్నప్పటికీ.. ఆయా శాఖలు ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నాయి. జిల్లాలోని 558 గ్రామ పంచాయతీల్లో.. పంచాయతీకో నర్సరీని ఏర్పాటు చేసి మొక్కలను పెంచుతున్నారు. ఆలస్యంగా విత్తనం నాటిన చోట ఇంకా మొలకలే రాలేదు. వాటి స్థానంలో కొత్తవాటిని నాటకపోవడంతో ఖాళీ బ్యాగులతోనే దర్శనమిస్తున్నాయి. ముందుగా నర్సరీ పెంపకాన్ని చేపట్టిన చోట్ల మొక్కలు ఏపుగా పెరిగి చెట్లను తలపిస్తున్నాయి. అవి సైతం సరైన పర్యవేక్షణ లేక వాడిపోయాయి. గత తొమ్మిదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏటా జూన్ వచ్చిందంటే పెద్ద ఎత్తున హరితహారం మొక్కలు నాటేందుకు అధికారులు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసేవారు. ఈ క్రమంలో తొమ్మిదేండ్లలో జిల్లాలో 8.27కోట్ల మొక్కలను గత ప్రభుత్వం నాటింది. నర్సరీల్లో మొక్కల పెంపకం నుంచి సంరక్షణ వరకు ఆయా శాఖల అధికారులకు బాధ్యతలను అప్పగించి గత ప్రభుత్వం ప్రతి మొక్కనూ బతికించుకున్నది. కానీ.. ఇప్పుడా పరిస్థితి కనబడడం లేదన్న టాక్ సర్వత్రా వినిపిస్తున్నది.

### లక్ష్యం 25 లక్షలకు కుదింపు..

ప్రతి సంవత్సరం గ్రామీణాభివృద్ధి, అటవీ శాఖలు సంయుక్తంగా హరిత లక్ష్యాన్ని నిర్ణయిస్తాయి. వివిధ శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించి ఏయే శాఖలు ఎంత మేర మొక్కలు నాటాల్సి ఉంటుందో.. నిర్ణయం తీసుకుంటారు. ఈ ఏడాది హరితహారం లక్ష్యాన్ని కేవలం 25 లక్షల మొక్కలకే పరిమితం చేశారు. ఇందుకు స్థలాలు లేవన్న కారణాన్ని ఆయా శాఖలు చూపించినట్లు తెలుస్తున్నది. 2024లో 25 లక్షలు, 2025లో 23లక్షలు, 2026లో 22లక్షల మొక్కలను నాటేలా మూడేండ్ల లక్ష్యాన్ని నిర్దేశించారు. గత ప్రభుత్వంలో ఒక ఏడాదిలోనే కోటి మొక్కలను నాటిన సందర్భాలు ఉన్నాయి. కానీ.. కొత్త ప్రభుత్వంలో మూడేండ్ల టార్గెట్ కలిపి 80లక్షలు కూడా దాటకపోవడం గమనార్హం. గతంలో అన్ని ప్రభుత్వ శాఖలు భాగస్వామ్యమై హరితహారాన్ని విజయవంతం చేశాయి. ఈసారి డీపీవో, వ్యవసాయ, ఇరిగేషన్, ఎక్సైజ్, హెల్త్, హార్టికల్చర్, ఎండోమెంట్, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, మైన్స్, మార్కెటింగ్, సివిల్ సప్లయ్, శాఖలకు టార్గెట్స్ లేకపోవడంతో ఆయా శాఖలు హరితహారం కార్యక్రమానికి దూరంగా ఉండనున్నాయి.

### జూలైలో మొక్కలు నాటేందుకు చర్యలు..

నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా పర్యవేక్షిస్తున్నాం. ప్రస్తుతానికి అన్ని నర్సరీల్లోనూ మొక్కలు బాగానే ఉన్నాయి. జూలై నెలలో నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం గుంతలు తీసే పనులు జరుగుతున్నాయి.

– శ్రీలత, డీఆర్డీవో, రంగారెడ్డి జిల్లా

**2024లో హరితహారం లక్ష్యం ఇలా..**

| శాఖ | టార్గెట్ |
|---|---|
| అటవీ శాఖ | 3 లక్షలు |
| విద్యాశాఖ | 500 |
| పరిశ్రమల శాఖ | వెయ్యి |
| డీఆర్డీవో | 15 లక్షలు |
| మున్సిపాలిటీలు | 6లక్షలు |
| మొత్తం | 25.500 లక్షలు |



**కేసీఆర్ ప్రభుత్వంలో తొమ్మిదేండ్లలో నాటిన మొక్కలు ఇలా..**

| సంవత్సరం | నాటిన మొక్కలు(లక్షలలో) |
|---|---|
| 2015 | 73.78 |
| 2016 | 139.24 |
| 2017 | 71.041 |
| 2018 | 86.12 |
| 2019 | 105.429 |
| 2020 | 102.745 |
| 2021 | 89.248 |
| 2022 | 77.100 |
| 2023 | 82.418 |

# 25 మంది కేజీబీవీ విద్యార్థినులకు అస్వస్థత

- పరిగి దవాఖానలో చికిత్స
- పరామర్శించిన వికారాబాద్ కలెక్టర్, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, జూన్ 28 : మండలంలోని నస్కల్‌లోని కస్తూర్బా గాంధీ పాఠశాలకు చెందిన 25 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గురువారం మధ్యాహ్నం ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు ఇచ్చారు. సాయంత్రం స్నాక్స్‌లో భాగంగా శనగలు ఇవ్వగా అనంతరం మాత్రలు వేసుకున్న వారిలో 25 మంది బాలికలకు కండ్లు తిరగడంతోపాటు వాంతులు చేసుకుని అస్వస్థతకు గురి కాగా, పరిగి సర్కారు దవాఖానకు తరలించారు. కేజీబీవీ పాఠశాలకు చెందిన ఏడుగురు తీవ్ర అస్వస్థతకు గురవడంతో చికిత్స అందజేశారు. వారితోపాటు 18 మంది అస్వస్థతకు గురి కాగా, పరిగి దవాఖానలో చికిత్స అందించారు. అనంతరం వారిని గురువారం రాత్రి కేజీబీవీ పాఠశాలకు తీసుకెళ్లారు. వారిలో ఇరువురు పరిగి దవాఖానలో శుక్రవారం చికిత్స పొందారు. ఇదిలావుండగా శుక్రవారం సాయంత్రం మరోసారి ఆరుగురు బాలికలు అస్వస్థతకు గురవడంతో వారిని వెంటనే పరిగి దవాఖానకి తరలించారు. ఇదిలావుండగా ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు వేసుకోవడం వల్ల కొందరికి చిన్నపాటి సైడ్‌ఎఫెక్ట్ ఉంటుందని, ఎలాంటి ఇబ్బంది లేదని డీసీహెచ్ఎస్ డాక్టర్ ప్రదీప్ అన్నారు. ఒకరిద్దరికి అస్తమా ఉండడం వల్ల ఇబ్బంది కలిగిందని, పూర్తిస్థాయిలో వైద్యం అందించినట్లు తెలిపారు.

### నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించిన వికారాబాద్ కలెక్టర్, ఎమ్మెల్యే

అస్వస్థతకు గురైన నస్కల్ కస్తూర్బాగాంధీ పాఠశాల విద్యార్థినులను శుక్రవారం వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్, పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి, వికారాబాద్ ఆర్డీవో వాసుచంద్ర, జిల్లా విద్యాధికారి రేణుకాదేవిలు పరామర్శించారు. పరిగిలోని దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను కలెక్టర్ ప్రతీక్‌జైన్ పరామర్శించి వారికి అందుతున్న చికిత్సపై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ ఆసుపత్రిని సందర్శించిన సమయంలో కౌంటర్ వద్ద వైద్యం కోసం వచ్చిన వారు గుంపుగా ఉండడంతో కలెక్టర్ డాక్టర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి కేజీబీవీ పాఠశాలను సందర్శించి అస్వస్థతకు గురైన విద్యార్థినులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు విద్యార్థులకు భోజనం, శుభ్రతలో అలసత్వం వహిస్తే సస్పెండ్ చేస్తామని ఎమ్మెల్యే హెచ్చరించారు.


దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శిస్తున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

# మెతుకు వేటలో చితుకుతున్న బతుకులు

## విషాదం నింపిన షాద్‌నగర్ గ్లాస్ ఫ్యాక్టరీ ప్రమాదం

- గాలిలో కలుస్తున్న వలస కార్మికుల ప్రాణాలు
- ప్రాణాంతకమవుతున్న పరిశ్రమల నిర్లక్ష్యం
- ప్రాణాలు కోల్పోతున్న వలస కార్మికులు
- శాశ్వత పరిష్కారాలు, పరిహారాలకు దూరంగా యాజమాన్యాలు

షాద్‌నగర్, జూన్ 28 : బుక్కెడు మెతుకులను వెతుక్కుంటు రాష్ట్రాలు దాటి పరాయిచోటికి వచ్చి పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులు విగత జీవులై కుటుంబాలకు విషాదాన్ని మిగుల్చుతున్నారు. పరిశ్రమల నిర్వాహకుల నిర్లక్ష్యం ప్రమాదాలను సృష్టిస్తుంటే ఆ ప్రమాదాలు కార్మికుల ప్రాణాలను హరిస్తున్నాయి. పరిశ్రమల ప్రమాదాలకు శాశ్వత పరిష్కారాలు చూపక, బాధిత కార్మికులకు పరిహారాలు ఇవ్వక వేధించే యాజమాన్యాలు కూడా ఉన్నాయి. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు కానీ, పరిశ్రమల యాజమాన్యాలు కానీ శాశ్వత పరిష్కారాలను చూపడంతో విఫలమవుతున్నారు. తాజాగా శుక్రవారం షాద్‌నగర్ గ్లాస్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంతో కార్మికుల భద్రతపై యాజమాన్యాల నిర్లక్ష్యం మరోసారి చర్చనీయాంశమైంది.

### ఉపాధికి నెలవుగా షాద్‌నగర్ పారిశ్రామికం..

షాద్‌నగర్ ప్రాంతం పారిశ్రామిక రంగంలో రాష్ట్ర రాజధానికి దీటుగా అభివృద్ధి చెందుతున్నది. ఇక్కడి పారిశ్రామిక ప్రాంతంలో వందలకుపైగా చిన్న, మధ్యతరహా, భారీ పరిశ్రమలు ఉన్నాయి. కాస్మెటిక్స్, బ్యాటరీలు, ఫార్మా, ఇనుము, వంట నూనెలు, చాక్లెట్, బిస్కెట్ వంటి తినుబండారాలు, టెక్స్‌టైల్ పరిశ్రమలు ఈ ప్రాంతంలో వెలిశాయి. రాష్ట్రం నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు, బీహార్, పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, అస్సాం, ఒడిశా, కేరళ, మహారాష్ట్ర, గుజరాత్ వంటి రాష్ట్రాల నుంచి వేలాది మంది ఈ ప్రాంతంలో ఉపాధి పొందుతున్నారు. నిత్యం 40 వేలకు పైగా దినసరి కూలీలతో పాటు కార్మికులు, ఉద్యోగులు విధులు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆయా పరిశ్రమల యాజమాన్యాలు కార్మికుల భద్రతను విస్మరించడంతో తరచుగా ప్రమాదాలు జరిగి మృతి చెందుతున్నారు. అయినా సంబంధిత శాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.

### మృత్యుఘంటికలు..

షాద్‌నగర్ నియోజకవర్గంలోని వందలాది పరిశ్రమల్లో తరచుగా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. గతంలో 2012 ఆగస్టు 15 రోజున షాద్‌నగర్ శివారులోని స్టీమ్‌కోర్ ఇస్పత్ ఐరన్ పరిశ్రమలో జరిగిన సంఘటన దేశంలోనే ఓ సంచలనంగా మారింది. అప్పటి గాయం ఇప్పటికీ కార్మికులు, స్థానికుల్లో మెదులుతూనే ఉన్నది. నిబంధనలకు విరుద్ధంగా స్వాతంత్ర్య దినోత్సవం రోజున కార్మికులతో పని చేయించిన యాజమాన్యం కనీస విలువలు పాటించకుండా ఒకేసారి 12 మంది కార్మికులను బలి తీసుకున్నది. ఈ పరిశ్రమలో కొలిమి పేలి ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాలకు చెందిన కార్మికులు మృత్యువాతపడ్డారు. 2012 డిసెంబర్ 4న షాద్‌నగర్ శివారులోని ఎలికట్ట దేవశ్రీ స్టీల్‌పరిశ్రమలో వీరేందర్‌రాము అనే కార్మికుడు యాజమాన్య నిర్లక్ష్యానికి గురై మృత్యువాతపడ్డారు. 2011 అక్టోబర్ 18న కొత్తూరు మండల కేంద్రంలోని వినాయకస్టీల్ పరిశ్రమలో ఇనుప ద్రవపాత్ర పేలి నలుగురు కార్మికులు మృత్యువాతపడ్డారు. 2011లో కొత్తూరులోని ఆర్ఎం సిలిండర్స్ పరిశ్రమలో సిలిండర్ పేలి ఉత్తరప్రదేశ్‌కు చెందిన సుధీర్ అనే కార్మికుడు, 2010 జూలై 6న శివశక్తి స్టీల్ పరిశ్రమలో నర్సింహరాజు అనే కార్మికుడు బంకులో పడి మృతి చెందాడు. 2009 ఆగస్టు 7న కొడిచెర్ల గ్రామంలోని ఆనంద్ ఇస్పత్ ఐరన్ పరిశ్రమలో సంపులో పడి మరో కార్మికుడు మృత్యువాతపడ్డాడు. తాజాగా కొత్తూరు మండలం నందిగామ పిత్తి ల్యామినేషన్ పరిశ్రమలో మిషనిస్ట్ గ్రైండర్ వద్ద పని చేస్తుండగా మహారాష్ట్రలోని సోలీపూర్‌కు చెందిన సాయిబనా శంకర్ పటేల్ (23) అనే కార్మికుడు, కొందుర్గు మండలం దివ్యశక్తి పేపర్ మిల్‌లో పని చేస్తున్న జార్ఖండ్ రాష్ట్రం గొడ్డా జిల్లా సేతుబంద గ్రామానికి చెందిన సునేలాల్ (24) అనే కార్మికుడు పరిశ్రమలో జరిగిన ప్రమాదాలకు బలయ్యారు. ఇవేకాకుండా ప్రమాదాల్లో మృతి చెందిన ఎంతో మంది కార్మికుల వివరాలను బయటకి పొక్కకుండా పరిశ్రమల యాజమాన్యాలు ప్రయత్నించిన ఘటనలు ఉన్నాయి.


షాద్‌నగర్ గ్లాస్ పరిశ్రమలో పేలుడుధాటికి చెల్లాచెదురైన పరికరాలు

### ఐదుగురి మృతితో విషాదఛాయలు

ఫరూఖ్‌నగర్ మండలం చింతగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని సౌత్ గ్లాస్ లిమిటెడ్ పరిశ్రమలో గ్లాస్ నాణ్యతను పరిక్షించే అటోక్లివ్ అనే గ్యాస్ గది పేలి ఉత్తరప్రదేశ్‌కు చెందిన నికిత్‌కుమార్ (22), రామ్‌సేత్ (24), బీహార్ రాష్ట్రానికి చెందిన చిత్తరంజన్ (31), రాంప్రకాష్ (31), ఒడిశా రాష్ట్రానికి చెందిన రతికాంత్ (25) అనే వలస కార్మికులు తమ ప్రాణాలను కోల్పోయారు. ఈ సంఘటనతో స్థానికంగా విషాదఛాయలు నెలకొన్నాయి. మూడు నెలల కింద కాశిరెడ్డిగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని బ్లండ్ కలర్స్ పరిశ్రమలో అగ్ని ప్రమాదం చోటుచేసుకొని బీహార్‌కు చెందిన ముగ్గురు కార్మికులు మృతి చెందారు. కొందుర్గు మండలం ఐరన్ పరిశ్రమలో ఫర్నస్ పేలి బీహార్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు కార్మికులు చనిపోయారు. నెలల వ్యవధిలోనే సుమారు 10 మంది వలస కార్మికులు మృత్యుఒడిలోకి చెరుకోగా పదుల సంఖ్యలో కార్మికులు తీవ్ర గాయాలపాలయ్యారు. నందిగామ మండల కేంద్రంలోని కెమికల్ పరిశ్రమల్లో భారీ అగ్ని ప్రమాదం జరగగా పలువురు కార్మికులు ప్రాణాలతో బయటపడ్డారు. ఇలా నిత్యం ఏదో ఓ పరిశ్రమలో ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారుల పర్యవేక్షణ కరువైందని కార్మికులు, ప్రజలు వాపోతున్నారు.


క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న కలెక్టర్ శశాంక, ఇతర ఉన్నతాధికారులు